**రా**మ్మూర్తి ఫోన్ చేశాడు "సాయం కాలం కలుద్దామా?" అంటూ.

"సరే!" అన్నాను.

రామ్మూర్తికీ నాకూ మధ్య పాతి కేళ్ల స్నేహం వుంది. రామ్మూర్తి నాకంటే వయసులో చాలా పెద్ద వాడు. వయసు తేడా మా స్నేహానికి



# మారాలి మనం

అడ్డంకి కాలేదు. మా మధ్య స్నేహానికి పునాది సాహిత్యం! ఇద్దరం అడపాదడపా రచనలు చేస్తుండేవాళ్లం. చేసిన రచనల గురించి, వ్రాయబోయే వాటి గురించీ చర్చించుకొంటూ వుండేవాళ్లం. ఆ చర్చలు ఒక్కోసారి నిమిషాలుగా కాక గంటలుగా మారేవి.

ఈ మధ్య ఇరువురి మధ్యా సాహిత్య చర్చ తగ్గింది. కారణం? నేను కొన్ని అనుకోని వ్యక్తిగత ఇబ్బందుల్లో పడ్డం, వాటివల్ల మానసిక ప్రశాంతత చెడ్డం జరిగింది. రామ్మూర్తి రిటైర్ అయి పదేళ్లుపైనే అయింది. ఒకమ్మాయికి ఎలాగో ఓలాగా పెళ్లి చేశాడు. పెళ్లికి ఇంకో అమ్మాయి, అబ్బాయి వున్నారు. అబ్బాయి ప్రయివేట్ సంస్థలో పనిచేస్తున్నాడు. అమ్మాయి బాగా చదువుకొంది కానీ ఉద్యోగం లేదు. అబ్బాయి వయసు ముప్పయి దాటింది. అమ్మాయి వయసు ముప్పయికి చేరుకొంది. ఎన్ని సంబంధాలు చూసినా, ఏదీ ఖాయం కావటం లేదు. రామ్మూర్తికి దిగులు పట్టుకొంది. "పెళ్లిళ్లు చేయటం ఈ కాలంలో చాల కష్టమైపోయిందయ్యా!" అని వాపోయేవాడు. అయినా సంబంధాలు చూడ్డం మాత్రం మానలేదు. ఇదివరకు నిత్యం కలుసుకొనేవాళ్ళం. ఇప్పుడు అప్పుడప్పుడూ కలుసుకొంటున్నాము.

రెండు వారాల తర్వాత రామ్మూర్తి నుంచి ఫోన్. సాయంకాలం ఇద్దరం కలుసుకొన్నాం. టీ తాగి వెళ్ళి, పార్కులో కూర్చున్నాం! కాసేపు పిచ్చాపాటి జరిగాక అడిగాను.

"ఏదైనా సంబంధం ఖాయం అయ్యిందా?"

"ఇంకా లేదయ్యా! జాతకాలు, గోత్రాలు ఓగోల అయితే, ఉద్యోగం వుందా? అని మరో గోల. మావాడి విషయం తీసుకొంటే, మావాడు చేసేది చిన్న ఉద్యోగమే! ప్రయివేట్ సంస్థ. చిన్న ఉద్యోగం అని ఆడపిల్లల తల్లిదండ్రులు పెదవి విరుస్తున్నారు. ఇక అమ్మాయి విషయానికి వస్తే, ఉద్యోగంలేదు అంటున్నారు. ఈకాలంలో గవర్నమెంట్ ఉద్యోగాలు రావాలంటే ఎలా వస్తాయి? చిన్నా చితక ఉద్యోగాలు చేసి, చాలించి వూరికే కూర్చుంది. మావాడికి పేదింటి పిల్లయినా సరే, చదువుకొని కాస్త చక్కగా వున్న అమ్మాయి అయితే చాలనుకొంటే, పేదవాళ్లు కూడా స్థిరమైన ఉద్యోగం లేదా అని అడుగుతున్నారు. ఏదో ఉద్యోగం చేసుకొంటూ పిల్లని పోషించుకొనేవాడైతే చాలు అనుకొంటే 'ఉద్యోగం' అన్నది పెద్ద అడ్డంకిగా మారింది. ఏంచెయ్యాలో అర్థంకావటం లేదు" భారంగా నిట్టూర్పు వదులుతూ అన్నాడు రామ్మూర్తి.

"ఈ పరిస్థితి అంతటికీ కారణమేమిటంటారు?"

"ఏమో నువ్వే చెప్పు!"

"ప్రతి మనిషిలోనూ అభద్రతాభావం పెరిగిపోవటం. మానవ సంబంధాల కంటే డబ్బుకు, హోదాకు ఎక్కువ విలువ ఇవ్వటం".

"ప్రపంచమే అలా మారింది ఏం చేస్తాం!"

"ప్రపంచం మారటం కాదు. మనమే మార్చుకొంటున్నాం! గతంలో దైనందిక అవసరాలు తీరి, జీవితం సాఫీగా వెళ్ళిపోతే సరి

**యస్.డి.వి. అజీజ్**

అనుకొనేవారు. ఇప్పుడలాకాదు... కోరికలు పెరిగాయి. ఎంత త్వరగా పైస్థాయికి వెళ్ళాలి అని ఆరాటపడుతున్నారు. ఆ ఆరాటం ఫలితమే ఇదంతా! ముఖ్యంగా మధ్యతరగతి వారిలోనే ఈ ఆరాటమంతా. వారి దృష్టంతా సంపన్నుల జీవనశైలిమీదే వుంది. దాన్ని అనుసరించడానికే ప్రయత్నిస్తారు. ఏ కొందరో వారి స్థాయికి వెళ్తున్నారు. మిగతా వారంతా... అశాంతి పాలవుతున్నారు. వీళ్లు పైకి ఎదగనూ లేరు, క్రిందికి జారనూలేరు. త్రిశంకుస్వర్గంలో వుంటున్నారు".

"నువ్వన్నది నిజమే! ఈ కాలంలో కూడా ఇంకా జాతకాలు, గోత్రాలు ఏంటి? చిరాకు వేస్తుంది".

"తాము అనుకొన్న విధంగా, అన్ని విధాలుగా తగిన సంబంధమైతే గోత్రాలు, జాతకాలకు పెద్ద పట్టింపు ఇవ్వటంలేదు. ఆ విషయంలో ఏదోలా రాజీపడిపోతున్నారు. అన్ని విధాలుగా అనుకోని సంబంధం కానప్పుడు జాతకాల్ని, గోత్రాల్ని అడ్డం పెట్టుకొని సంబంధాల్ని వొదిలేస్తున్నారు.

"నువ్వన్నది కూడా నిజమే! ఏం చేద్దాం మరి!" రామ్మూర్తి పలుకుల్లో నిరాశ.

"లేటు మ్యారేజీలు కాకుండా, సకాలంలో మ్యారేజీలు జరగాలంటే - ఈ జాతకాల, గోత్రాల, కులాల, మతాల గొడవ పోవాలంటే ముందుగా తల్లిదండ్రులు మారాలి"

"అంటే?"

"వివాహ విషయంలో నిర్ణయం వారికే వొదిలెయ్యాలి. వివాహ సంబంధంగా మీకు నచ్చిన వ్యక్తిని మీరే నిర్ణయించుకోండి - కాకపోతే ఆ నిర్ణయం సరియైనదా? కాదా? అన్న విషయంలో మిమ్మల్ని కన్న పెద్దలుగా మమ్మల్నో మాట సంప్రదించండి... అని చెప్పాలి. వారు ఎన్నుకొన్న వ్యక్తి యోగ్యుడని భావిస్తే, పెద్ద మనసుతో వారికి వివాహం జరిపించాలి."

"అంత స్వేచ్ఛ ఇస్తే ఇంకేమైనా వుందా? సంప్రదాయాలు, కట్టుబాట్లూ నాశనమై పోవూ?"

"మనిషి పుట్టి నాగరికత నేర్చుకొన్నాక సంప్రదాయాలు, కట్టుబాట్లు పుట్టుకొచ్చాయి. అవి ఇప్పుడు భవిష్యత్‌కి అడ్డంకిగా మారినప్పుడు వాటిని ప్రక్కకు తోసివేయటంలో తప్పులేదు".

"నువ్వు ఎన్నయినా చెప్పు... వివాహ విషయంలో వారికి స్వేచ్ఛ ఇవ్వటం సమంజసం కాదనిపిస్తోంది".

"మీలో పాతుకుపోయివున్న సనాతన భావజాలాన్ని దూరంగా విసిరేసి, విశాల దృక్పథంతో ఆలోచించండి..."

రామ్మూర్తి ఏం మాట్లాడలేదు.


"వివాహ విషయంలో కూడా పిల్లలకు స్వేచ్ఛ లేకుండా చేసినప్పుడు, సరియైన సంబంధాలు దొరకనపుడు పెద్దలకు మిగిలేది మానసిక క్షోభే!

రామ్మూర్తి మళ్లీ ఏం మాట్లాడలేదు.

మా ఇద్దరి మధ్య స్నేహం వేరే, కొన్ని విషయాల్లో మా ఇద్దరి మనసుల్లో వున్న అభిప్రాయాలు వేరే! ఆ అభిప్రాయాలు మా స్నేహాన్ని మాత్రం దూరం చేయలేదు. ఎవరి మనోభావాలను వాళ్లం స్వేచ్ఛగా చెప్పుకునేవాళ్లం. అలా వున్నప్పుడే స్నేహం నిలుస్తుంది.

"ఇక ఈ విషయం గురించి చర్చదేనికి?... సాహిత్యం గురించి మాట్లాడుకొందాం!

కాసేపటి తర్వాత మా చర్చ సాహిత్యం వైపు మళ్లింది. ఓ గంటసేపు చర్చించుకొన్న




తర్వాత ఎవరిళ్లకు వాళ్ళం బయల్దేరాం!

మేమిరువురం కలిసి... రెండు నెలలు గడిచిపోయాయి. అప్పుడప్పుడూ నేనే రామ్మూర్తికి ఫోన్ చేశాను "కలుద్దామా?" అని. చేసిన ప్రతిసారీ "కొంచెం బిజీగా వున్నాను... కుదర్దులే!" అన్న సమాధానం.

చివరికి ఓ రోజు రామ్మూర్తి నాకు ఫోన్ చేశాడు. అదీ రాత్రి పదిగంటల సమయంలో... "అర్జెంటుగా నీతో మాట్లాడాలి"...

"ఎక్కడ కలుద్దాం?" అడిగాను. అతనేదో ఆందోళనలో వున్నాడనిపించింది.

"మీ ఇంటికే వస్తాను"

"సరే రండి!"

ఓ అరగంట తర్వాత రామ్మూర్తి మా ఇంటికొచ్చాడు. "భోంచేశారా?" అని అడిగాను.

"లేదు తినాలనిపించటంలేదు."

"ముందు భోంచేద్దాం!... నేనూ ఇంకా తిన్లేదు. ఈ మధ్య లేటుగా తినటం అలవాటయ్యింది... రండి!"

"నాకొద్దు! నువ్వు భోంచెయ్యి!" చెప్పాడు రామ్మూర్తి.

"మా ఇంట్లో భోంచెయ్యక ఎన్నాళ్లయ్యింది... కాదనకండి!"

తప్పనిసరియై నాతోపాటు భోంచేశాడు రామ్మూర్తి.

భోంచేశాక... ఇద్దరం డాబాపైకి వెళ్లి కూర్చున్నాం!

"చెప్పండి! ఏమిటి విషయం?"

"మా అబ్బాయికి... తాను పనిచేసే సంస్థలోనే తనతోపాటు పనిచేస్తున్న ఓ అమ్మాయి నచ్చిందట! ఆమె కూడా పెళ్లికి ఒప్పుకొందట! ఆ అమ్మాయినే పెళ్లి చేసుకొంటాను... మా ఇద్దరికీ పెళ్లి జరిపించండి!" అని అడిగాడు. మేము ఒప్పుకోకపోతే, తానే పెళ్లిచేసుకొంటాను

అంటున్నాడు. రెన్నెళ్లుగా ఇదే గొడవ.

"వద్దని ఎంత చెప్పినా వినిపించుకోవటం లేదు".

"ఎందుకు వద్దంటున్నారు?"

"అమ్మాయిది మా కులం కాదు"

"కాకపోతేనేం? ఆ అమ్మాయి మంచిదయితే చాలు"

"మంచీ చెడూ ఇప్పుడే ఎలా నిర్ణయిస్తాం? రేపు వారివురూ గొడవపడి ఎవరికి వారయిపోతే?"

"సంప్రదాయబద్ధంగా ఒకే కులంలోనే జరిగిన పెళ్లిళ్లుకూడా పెటాకులయి, విడాకులదాకా పోవటంలేదా? ఎవరి విషయంలోనో ఏదో జరిగిందని... అలాంటి సంఘటనే జరుగుతుందేమో అనుకోవటం అంత సమంజసం కాదు".

"వాడి మాట మన్నించి, వాడికిష్టమైన అమ్మాయితోనే పెళ్లి జరిపిస్తే, అమ్మాయి విషయం ఎలా? అమ్మాయిని పెళ్లి చేసుకోవడానికి ఎవరు ముందుకు వస్తారు?"

"మీరింకా పాతకాలపు ఆలోచనాధోరణిలోనే వున్నారు. సమాజం మారుతోంది. మారుతున్న సమాజంతోపాటూ మనమూ మారాలి".

"నువ్వు ఎన్నయినా చెప్పు! కులాంతర వివాహనికి నా మనసు అంగీకరించదు".

"మీరీ నిర్ణయంలో వున్న తర్వాత నేను చెప్పేదేముంది?"

"రెన్నెళ్లుగా కంటికి కునుకే సరిగా లేదు. వాడిష్టాన్ని అంగీకరిస్తే జీవితాంతం... బాధకు గురికావలసివస్తుంది".

"కన్నతండ్రిగా మీ బాధను అర్థం చేసుకోగలను. కానీ వయసొచ్చిన కొడుకు మనసు కూడా మీరు అర్థంచేసుకోవాలి. మీవన్నీ ఊహలతో కూడుకున్న భయాలే! వాటన్నింటినీ విడిచిపెట్టండి! పెద్దమనసుతో అబ్బాయికి నచ్చిన అమ్మాయితోనే వివాహం చేయండి!

"మరి అమ్మాయి విషయం? దానికి పెళ్లి జరగడం ఎలా? అన్నీ సవ్యంగా వుంటేనే పెళ్లిళ్లు కష్టమైపోతున్న ఈ రోజుల్లో వీడీ పెళ్లి చేసుకొంటే దాని గతి...?

"మీ అబ్బాయి పెళ్లి అమ్మాయికి అడ్డంకి కాబోదు. ఆమె వివాహం కూడా జరుగుతుంది. వూరికే ఏదేదో ఆలోచించి మనసు పాడుచేసుకోకండి!"

కొడుకు వివాహ సంబంధంగా నాతో ఎన్ని విధాలుగా చర్చించినా చివరికి సంప్రదాయపు గీత దాటడానికి ఇష్టపడలేదు రామ్మూర్తి. నాకూ ఓపిక నశించి "మీ ఇష్టం" అనేసాను.

మరో నెలరోజులు జరిగాయి.

రామ్మూర్తి కొడుకు తండ్రితో సంబంధం లేకుండానే, తాను ఇష్టపడ్డ అమ్మాయిని పెళ్లి చేసుకొన్నాడు. పెళ్లికి రామ్మూర్తి వెళ్లలేదు. ఇంటి సభ్యులను కూడా వెళ్లనివ్వలేదు.

మరో ఆరునెలల తర్వాత రామ్మూర్తి కూతురు కూడా తమ కులంకాని వ్యక్తిని పెళ్లిచేసుకుని వెళ్లిపోయింది. ఆ పెళ్లికి కూడా రామ్మూర్తి వెళ్లలేదు. భార్యాభర్తలిద్దరూ మిగిలారు.

రామ్మూర్తి నాతో కలిసినా ముభావంగానే వుంటున్నాడు. ఈ ముభావమంతా కొన్నాళ్లే! కాలం గడిచేకొద్దీ అంతా సర్దుకొంటుంది. ఈ విధంగా అయినా రామ్మూర్తి పిల్లల పెళ్లిళ్లు జరిగిపోయినందుకు నాకు ఆనందంగానే వుంది. సంప్రదాయంకన్నా భవిష్యత్ ముఖ్యం కదా మరి! ●